

పరేడ్‌లో పాల్గొన్న భారత నౌకాదళ సిబ్బంది

గోవాడ చెరకు రైతుకు దక్కని మద్దతు

చెరకు మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

- 10.25 శాతం రికవరీ సాధించే షుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని రైతులకు మాత్రమే వర్తింపు
- గోవాడలో 9కి మించి రికవరీ శాతం పెరగకపోవడంతో దక్కని ఊరట

చోడవరం, ఫిబ్రవరి 22:

చెరకు మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచినా గోవాడ చెరకు రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. 10.25 శాతం రికవరీ సాధించే షుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడమే దీనికి కారణం. ఎందుకంటే వివిధ కారణాల వల్ల గోవాడలో రికవరీ శాతం 9కి మించి పెరగకపోవడంతో కేంద్రం పెంచిన మద్దతు ధర పొందలేని పరిస్థితి నెలకొంది.



చెరకు తోట

వ్యవసాయ పంటలపై మద్దతు ధరల కోసం దేశంలో రైతులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2024-25 సీజన్‌కు చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3400 ధర చెల్లించనున్నట్టుగా ప్రకటించింది. గత ఏడాది టన్నుకు రూ.3,150 ధర ఉంటే, ఈ ఏడాది టన్నుపై రూ.250 పెంచి మద్దతు ధర రూ.3400 చేసింది. అయితే కేంద్రం ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర 10.25 శాతం రికవరీ సాధించే షుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని రైతులకు మాత్రమే వర్తించనుంది. కేంద్రం టన్నుకు రూ.3400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ రికవరీ శాతం ఆధారంగా మద్దతు ధర వచ్చే పరిస్థితి వల్ల గోవాడ చెరకు రైతులకు మాత్రం టన్నుకు రూ.3400 కంటే రూ.170 తక్కువగానే అందనుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితుల కారణంగా కేంద్రం ఇచ్చిన మద్దతు ధర కూడా అందే పరిస్థితి లేకపోవడంతో గోవాడ చెరకు రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలు మూతపడగా, గోవాడ కూడా అదే దారిలో పయనిస్తుండడం, ఇప్పట్లో ఈ ఫ్యాక్టరీ కూడా కోలుకునే దారి లేకపోవడంతో ఈ ప్రభావంతో గ్రామాల్లోని రైతులు చెరకు సాగు తగ్గించి వేస్తున్నారు. దీంతో గోవాడకు చెరకు సరఫరా కూడా కావడం లేదు. ఏటా ఈ ఫ్యాక్టరీలో క్రషింగ్ తగ్గిపోతూ వస్తున్నది. ఒకప్పుడు 5 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేసే గోవాడ, గత ఏడాది కేవలం 2 లక్షల 21 వేల టన్నులకే పరిమితమైపోగా, ఈ ఏడాది 2 లక్షల టన్నులు ఆడేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. టన్నుకు అన్ని రకాల ఖర్చులు కలుపుకుని రూ.60 వేలు నుంచి రూ.70 వేలు పైబడి పెట్టుబడి అవుతుంటే, కనీసం 15 టన్నులు దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది. ఎకరా చెరకుపై రైతుకు తక్కువలో రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు నష్టం వాటిల్లుతున్నది. చెరకు పంటకు మద్దతు ధర టన్నుకు రూ.4 వేలు చెల్లిస్తే తప్ప గిట్టుబాటు కాదన్న అభిప్రాయం రైతాంగం నుంచి బలంగా వినిపిస్తున్నప్పటికీ, గోవాడ ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సర్దుకుపోతున్నారు. అయినా ఫ్యాక్టరీలో రికవరీ శాతం పెరగకపోవడం, కేంద్రం పెంచే మద్దతు ధర కూడా చేతికి అందక గోవాడ చెరకు రైతులు ఆవేదన చెందుతున్నారు. గోవాడలో రికవరీ శాతం 9కి మించి పెరగకపోవడంతో కేంద్రం పెంచిన మద్దతు ధర కూడా పొందలేక గగ్గోలు పెడుతున్నారు.

గత ఏడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, రికవరీ శాతం దృష్ట్యా గోవాడ రైతులకు దక్కిన ధర ఇలా వున్నాయి.

సంవత్సరం	కేంద్ర మద్దతు ధర	గోవాడ రైతులకు దక్కిన ధర
2018-19	రూ. 2750	రూ.2681
2019-20	రూ. 2750	రూ.2612.50
2020-21	రూ. 2850	రూ.2707.50
2021-22	రూ. 2900	రూ.2755.00
2022-23	రూ. 3000	రూ.2821.25
2023-24	రూ. 3115	రూ.2919.00
2024-25	రూ. 3400	రూ.3230.00

మద్దతు ధర ఏ మాత్రం చాలదు



ఏటా చెరకు సాగుకు పెట్టుబడి ఖర్చులు చేయిదాటిపోతున్నాయి. కూలీల రేట్లు, ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. టన్నుకు రూ.4 వేలు ఇచ్చినా బొటాబొటీగా సరిపోతుంది తప్పితే, రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. చెరకు రైతులకు గిట్టుబాటు ధరతో పాటు, సబ్సిడీ ధరలపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందజేయాలి.

- సయ్యపురెడ్డి రాంబాబు, చెరకు రైతు, వడ్డాది



హెలికాప్టర్ల నుంచి బాంబుల వర్షం

అంబరాన్నంటిన నేవీ సంబరం

ఆకాశంలో అద్భుతాలు

- బాంబులు కురిపించిన జెట్ విమానాలు
- సయ్యాటలాడిన చేతక్ హెలికాప్టర్లు
- తొలిసారి దర్శనమిచ్చిన 'తేజస్' యుద్ధ విమానం
- కనులవిందుగా సాగిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- సాగరతీరంలో 'మిలాన్' సందడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

వినువీధుల్లో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. జెట్ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. చేతక్‌లు సయ్యాటలాడాయి. సీ హాక్‌లు...హాలో చెప్పాయి. ఇంకా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానం...ఇవన్నీ మిలాన్ ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో కనువిందు చేశాయి.



హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో బోటులోకి దిగుతున్న కమెండోలు

ఆర్కే బీచ్‌లో గురువారం సాయంత్రం భారత నౌకాదళం నిర్వహించిన వైమానిక శక్తి ప్రదర్శన కళ్లార్పకుండా చేసింది. మొత్తం 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు వాటి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. పిడుగులు పడుతున్నాయా...అని భ్రమించేలా శబ్దం చేస్తూ దూసుకొచ్చిన జెట్ విమానాలు మిరుమిట్లు గొలిపే బాంబుల వర్షాన్ని కురిపించాయి. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఉపయోగించే చేతక్ హెలికాప్టర్లు వేదిక ముందు అతిథుల ఎదుట అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ సయ్యాటలాడాయి. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమం...జాతీయ పతాకంలోని మూడు రంగులు సముద్రంలో నుంచి పైకి ఎగిసేలా పేల్చిన బాంబులతో మొదలైంది. బీచ్‌లో బందీలను విడిపించడానికి కమెండోలు జెమినీ బోట్లపై వచ్చి చేసిన దాడి యుద్ధ రంగాన్ని తలపించింది. ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తున ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి ఒకరి తరువాత మరొకరుగా దూకిన మెరైన్ కమెండోలు వేదిక ముందు సురక్షితంగా దిగి ముఖ్య అతిథికి జ్ఞాపికను బహూకరించిన సాహస కార్యం అందరినీ కట్టిపడేసింది. మిగ్ 29కు యుద్ధ విమానాల

... మిగతా 7వ పేజీలో

దర్జాగా గ్రావెల్ దందా

రేయింబవళ్లు అక్రమ తవ్వకాలు, తరలింపు

- స్థానిక వైసీపీ నాయకుల ప్రమేయం ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు



అనకాపల్లి మండలం సంపతిపురం రెవెన్యూ పరిధిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జగనన్న కాలనీల్లో మెరక పనులు సాకుగా చూపుతూ కొండలను పిండి చేస్తున్నారు. ఇందులో స్థానిక వైసీపీ నాయకుల ప్రమేయం ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రేయింబవళ్లు దర్జాగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్నా రెవెన్యూ, గనుల శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



అనకాపల్లి పరిసరాల్లో ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలు, వెంచర్ల పనులు జోరుగా సాగుతుండడంతో గ్రావెల్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో వైసీపీ స్థానిక చోటా నాయకులు గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. జగనన్న కాలనీల్లో మెరక పనులు చేపట్టే నెపంతో స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా పది నుంచి 20 టన్నులు గ్రావెల్ రవాణాకు అనుమతి పొంది వందల టన్నులు తరలించుకుపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా గ్రావెల్ అక్రమ రవాణాపై ఫిర్యాదులు చేస్తే రెవెన్యూ, గనులు, పోలీసు శాఖల అధికారులు తనిఖీలు చేసి మొక్కుబడిగా జరిమానా విధిస్తున్నారని తెలిసింది. అనకాపల్లి మండలం సంపతిపురం రెవెన్యూ పరిధిలో కొన్ని రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్‌తో స్థానిక వుడా కాలనీని ఆనుకొని వున్న పచ్చని కొండను కొందరు పిండి చేస్తున్నారు. అలాగే కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోనూ కొంతకాలంగా అనధికార గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ట్రాక్టర్ అయితే గ్రావెల్ లోడ్ రూ.1000 నుంచి రూ.1,500, అదే టిప్పర్ అయితే రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు రేటు నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నట్టు తెలిసింది. సంపతిపురంలో కొంత కాలంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతూ సమీపంలోని కొన్ని ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో గ్రావెల్ టిప్పర్లు అనకాపల్లి జాతీయ రహదారిని ఆనుకొని నిర్మాణంలో ఉన్న వెంచర్లకు తరలిస్తున్నట్టు సమాచారం. రాజకీయ ఒత్తిళ్ల వల్ల అధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

పేకాట శిబిరంలో కత్తి పోట్లు

గోపాలపురంలో కలకలం

- జూదరుల మధ్య గొడవ
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం
- విషయం బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్న కానిస్టేబుల్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 22:

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయానికి కూతవేటు దూరంలో గోపాలపురంలో పేకాట శిబిరం యథేచ్ఛగా కొనసాగు తున్నట్టు తెలిసింది. బుధవారం తెల్లవారు జామున జూదరుల మధ్య గొడవ జరిగి కత్తి పోట్లకు దారి తీసిందని, ఇందులో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. అయితే స్థానిక కానిస్టేబుల్ అండదండలతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తుండడంతో ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడినట్టు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ వర్గాలు అందించిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని శివారు గ్రామమైన గోపాలపురం గ్రామంలో పేకాట శిబిరాన్ని పోలీసులకు ముడుపులు చెల్లించుకుంటూ గోప్యంగా నిర్వహిస్తుంటారు. స్థానిక కానిస్టేబుల్ సహకారంతో రాత్రి 11 గంటల దాటాక తెల్లవారుజామున 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతున్నట్టు తెలిసింది. కాగా బుధవారం తెల్లవారుజామున పేకాట ఆడుతున్న విశాఖ జిల్లాకు చెందిన ధర్మారెడ్డికి, రమణ అనే మరో వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. దీంతో ధర్మారెడ్డిపై రమణ కత్తితో దాడి చేశాడు. పొట్టలో పొడవడంతో ధర్మారెడ్డికి తీవ్ర రక్తస్రావమైంది. దాడిని ఆపే ప్రయత్నంలో పేకాట శిబిరం నిర్వాహకుడు జె.శివకు కూడా గాయాలయ్యాయి. వీరిద్దరినీ అక్కడి జూదరులు అగనంపూడిలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో శివ చికిత్స పొందగా, ధర్మారెడ్డి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. అయితే ఈ విషయం బయటకు రాకుండా పోలీసులు మేనేజ్ చేస్తున్నారని సమాచారం. ఈ ఘటనపై రూరల్ సీఐ ధనుంజయరావును వివరణ కోరగా

... మిగతా 8వ పేజీలో

వైసీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- ఎమ్మెల్యే ధర్మశ్రీ తీరుపై సర్పంచులు, పార్టీ నాయకుల ఆగ్రహం
- ధర్మశ్రీకి మళ్లీ టికెట్ కేటాయిస్తే ఓటమి తథ్యమని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెంనాయుడు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 22:

వైసీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తీరుపై ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కేడర్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. ధర్మశ్రీ చర్యల వల్ల పార్టీ నష్టపోతుందని, పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి, తనకు నచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారంటూ గురువారం పెదమదీనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర కిసాన్ కార్యవర్గ సభ్యుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కొల్లిమళ్ళ అచ్చెంనాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన తనను అధ్యక్ష పదవి నుంచి తప్పించి, గత ఎంపీటీసీ ఎన్నికల్లో తనను ఓడించిన జోగా కొండబాబుకి పార్టీ మండల అధ్యక్ష పదవితో పాటు జిల్లా పదవులిచ్చి ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ ఫోరం సంఘాధ్యక్షుడు దేవర అప్పారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గెలుపు కోసం దశాబ్ద కాలంగా పాటుపడిన కేడర్‌ను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కె.ధర్మశ్రీకి కాకుండా మరొకరికి టికెట్ కేటాయించాలని, లేకపోతే పార్టీ ఓటమి తథ్యమన్నారు. పెదపూడి గోకివాడ వరకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మశ్రీ పార్టీ ఓటమికి కృషి చేసిన వారిని వెనకేసుకుని తిరగడం, నిజమైన కార్యకర్తలను పక్కన పెట్టడం దారుణమన్నారు. కార్యకర్తలను ఆదుకోవడంలో ధర్మశ్రీ విఫలమయ్యారని, ఆయన కారణంగా నిజమైన కార్యకర్తలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని వాపోయారు. వైస్ ఎంపీపీ గొంపా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మశ్రీ, పార్టీ మండల నాయకుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా అనర్హులను అందలం ఎక్కించడాన్ని ఆక్షేపించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ధర్మశ్రీకి సీటు ఇస్తే తాము సహకరించేది లేదని పెదమదీన సర్పంచ్ భర్త కేవీఆర్ నాయుడు స్పష్టం చేశారు. బుచ్చెయ్యపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాతాళ శ్రీను మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పార్టీ కోసం పనిచేసిన తనపై ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు దొండా అచ్చెయ్యదొర, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పెదపూడి ఎంపీటీసీ

... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి పూడిమడకలో మాఘ పౌర్ణమి జాతర

-7లో



ఫ్లైఓవర్ బ్రిడ్జి

ఎలమంచిలి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభం

ఎలమంచిలి, ఫిబ్రవరి 22:

ఎలమంచిలి (కొక్కిరాపల్లి)లోని ఫ్లైఓవర్ బ్రిడ్జిని గురువారం రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. అయితే ఈ నెల 28 నుంచి ఈ వం తెనపై రాకపోకలను అనుమతిస్తారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం పూర్తి కావడానికి ఎమ్మెల్యే యు.వి. రమణ మూర్తిరాజు (కన్నబాబు) ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు, చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ యు.సుకుమారవర్మ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా


తేజస్ యుద్ధ విమానాల నుంచి బాంబుల ప్రదర్శన


ముఖ్యఅతిథికి స్వాగతం పలుకుతూ జాతీయ పతాకం రంగుల్లో నీటి బాంబుల ప్రదర్శన


యుద్ధ నౌకల నుంచి ఫైరింగ్


చేతక్ హెలికాప్టర్ ప్రదర్శన


కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మెరైన్ కమెండో

అంబరాన్నంటిన నేవీ సంబరం

... 5వ పేజీ తరువాయి

గర్జన చెవులను హోరెత్తించింది. కొత్తగా నౌకాదళంలో చేరిన సీ హాక్ హెలికాప్టర్లు, దేశీయ తయారీ తేజస్ యుద్ధవిమానం విశాఖ ప్రజల ముందు ప్రత్యక్షమయ్యాయి. నిఘా విమానాలు డార్నియర్లు, బోయింగ్‌తో తయారైన పీ8ఐ నిఘా విమానం సముద్ర రక్షణకు మేమున్నామని చాటాయి. విమాన వాహక నౌకలు విక్రాంత్, విరాట్‌లు వేదికకు ఎదురుగా సముద్రంలో కొలువుదీరాయి.

కలర్‌ఫుల్ పరేడ్

మిలాన్‌కు హాజరైన 51 దేశాల ప్రతినిధులు వారి జాతీయ పతకాలను చేబూని ఒకరి తరువాత మరొకరు కవాతు చేసుకుంటూ వచ్చిన దృశ్యం ప్రపంచం మొత్తం విశాఖలోనే ఉందా?...అనిపించింది. నేవీ స్కూల్ చిన్నారులు, కోరుకొండ సైనిక్ స్కూల్ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్, శ్రీలంక, వియత్నాం, రష్యా, ఇరాన్, మారిషస్, ఫ్రాన్స్ తదితర దేశాలతో పాటు ఏపీ పోలీస్, కోస్టుగార్డు, ఏపీ పోలీస్ బ్యాండ్, నేవీ బ్యాండ్ బృందాలు పాల్గొన్నాయి.


పరేడ్‌లో పాల్గొన్న ఇండోనేషియా కళాకారులు

క్రైం... crime news

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి


సంజీవరావు (ఫైల్)

గొలుగొండ, ఫిబ్రవరి 22: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు అందించిన వివరాలివి. నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఏటిగైరంపేట నుంచి నర్సీపట్నం వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ శివారు గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన కాకర సంజీవరావు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఏటిగైరంపేట సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పారబోయడంతో అవి తింటున్న కుక్కల గుంపు ఒక్కసారిగా రోడ్డుపై రావడంతో బస్సు అదుపుతప్పి ద్విచక్ర వాహనంపైకి దూసుకు వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

నాతవరం, ఫిబ్రవరి 22: మండలంలోని తుని- నర్సీపట్నం రహదారిలో గల శృంగవరం సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కాకినాడ జిల్లాకు చెందిన కె.రత్నంతో పాటు నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బయ్యపురెడ్డిపాలెం నుంచి తుని వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న కోతులను తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఆటోలో చిక్కుకున్న ప్రయాణికులను ఇక్కడివారు బయటకు తీశారు. అయితే ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామారావు తెలిపారు.

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు

మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్

ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 22:

నగరంలో క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండు మ్యాచ్‌లు పోతినమల్లయ్యపాలెంలో గల ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నాయి. ఐపీఎల్ షెడ్యూల్‌ను గురువారం ప్రకటించారు. ఇందులో రెండు మ్యాచ్‌లు (మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్, ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్) విశాఖకు కేటాయించారు.

ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్‌తో మొహాలిలో, రెండో మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్‌లో ఆడనుంది. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లతో వరుసగా జరిగే మూడు, నాల్గో మ్యాచ్‌లను విశాఖలో ఆడడం విశేషం.

నాలుగేళ్ల తర్వాత

విశాఖలో నాలుగేళ్ల తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన గ్రూపు స్టేజ్ మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికైంది. 2019లో ఐపీఎల్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు లేకపోయినా కీలకమైన ఎలిమినేటర్, క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది.

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

గోపాలపట్నం, ఫిబ్రవరి 22: మిలాన్-24లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌కు ఐఎన్ఎస్ డేగాలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.22 గంటలకు విశాఖ చేరుకున్న ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తూర్పు నౌకాదళ ప్రధానాధికారి రాజేశ్ పెండార్కర్, అరకు ఎంపీ జి.మాధవి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో ఐఎన్ఎస్ చోళాకు బయలుదేరి వెళ్లారు. సముద్రిక ఆడిటోరియంలో నిర్వహించిన 'అంతర్జాతీయ మేరిటైమ్ సదస్సు'లో పాల్గొన్న అనంతరం ఉప రాష్ట్రపతి తిరుగు ప్రయాణమయ్యారు. ఢిల్లీ వెళ్లేందుకు మధ్యాహ్నం 12.30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

28న పాడేరులో భువనేశ్వరి పర్యటన

పాడేరు రూరల్, ఫిబ్రవరి 22 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న పాడేరు నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటించనున్నారని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి తెలిపారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సమయంలో ప్రాణాలను విడిచిన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆదుకునేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి ముందడుగు వేశారన్నారు. ఇందులో భాగంగా పాడేరు నియోజకవర్గం జి.మాడుగుల మండలం కిండంగిలో మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాల్సిందిగా ఆమె కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529



నేటి నుంచి పూడిమడకలో

మాఘ పౌర్ణమి జాతర


తీరంలో కొలువైన మాధవస్వామి

- శుక్రవారం రాత్రి జాగారం, శనివారం ఉదయం సముద్ర స్నానాలు
- తీరంలో భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు
- జిల్లా నలుమూలల నుంచి లక్ష వరకు భక్తులు వస్తారని అంచనా
- భారీస్థాయిలో పోలీస్ బందోబస్తు
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సులు
- అచ్యుతాపురం-పూడిమడకల మధ్య ఆటోలు బంద్

అచ్యుతాపురం,ఫిబ్రవరి 22:

మాఘ పౌర్ణమి జాతరకు పూడిమడక ముస్తాబైంది. మాఘ పౌర్ణమికి ఇక్కడ వారం రోజులుపాటు జాతర జరుగుతుంది. శుక్రవారం రాత్రికి భక్తులు ఇక్కడ జాగరణ చేస్తారు. ఇందుకోసం భజనలు, చిటికెల భజనలు, తప్పెటగుళ్ల, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ జాతరకు లక్షకు పైగా భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచి పూడిమడకకు వస్తారని అంచనా. రాత్రి జాగరణ చేసి శనివారం ఉదయం సముద్రంలో స్నానమాచరించి వందేళ్ల క్రితం నిర్మించిన సుభద్ర బలబద్ర సహిత జగన్నాథస్వామి, రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామిలను దర్శించుకుంటారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పూడిమడక వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీరంలో ఏర్పాట్లు చేశారు. తీరంలో హౌమాస్ట్‌లైట్లు, మహిళలు బట్టలు మార్చుకోవడానికి టెంటులు టెంట్‌లు ఏర్పాటు చేశారు. జగన్నాథస్వామి ఆలయం వద్ద క్యూలైన్లను ఏర్పాటు చేశారు.


పూడిమడకలో జగన్నాథస్వామి ఆలయం


భక్తులు పూజలందుకోనున్న గంగాదేవి అమ్మవారు

శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సులు

పూడిమడకకు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నుంచి 10 అదనపు బస్సులు నడుపుతున్నామని అనకాపల్లి పీటీడీ డిపో మేనేజర్ సుజాత తెలిపారు. ప్రతి రోజూ తిరిగే షెడ్యూల్ బస్సులతో పాటు రాత్రి నుంచి 40 బస్సులు నడుపుతున్నామన్నారు. పూడిమడకకు కిలోమీటరు దూరంలో గల ఉన్నత పాఠశాల వద్ద తాత్కాలిక బస్టాండ్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అచ్యుతాపురం-పూడిమడకల మధ్య షటిల్ నడుపుతున్నామన్నారు. అలాగే ఎలమంచిలి, కొండకర్ల జంక్షన్, గాజువాక, స్టీల్‌ప్లాంట్ నుంచి ప్రత్యేక బస్సులు పూడిమడకకు నడుపుతున్నారు.

తీరంలో భారీ బందోబస్తు

జాతర సందర్భంగా పూడిమడకలో భారీ స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అచ్యుతాపురం-పూడిమడకల మధ్య అవుట్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. తీరంలో కూడా మెరైన్ పోలీసులతో కలిసి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం అచ్యుతాపురం-పూడిమడకల మధ్య ఆటోలను శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు నిషేధించారు. పూడిమడక తీరంలో 30 మంది గజ ఈతగాళ్లను, ఆరు మర పడవలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు తెలిపారు. ముఖ్యంగా జేబుదొంగలపై నిఘా పెట్టామన్నారు. అలాగే జాతరకు వచ్చే మహిళలు బంగారు ఆభరణాలతో రావద్దని హెచ్చరించారు. సుమారు 130 మంది పోలీసులతో బందోబస్తుని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వాడపాలెం తీరం రెడీ

రాంబిల్లి : మాఘ పౌర్ణమి స్నానాలను భక్తులు ఆచరించేందుకు వాడపాలెం సముద్రతీరాన్ని సిద్ధం చేశారు. రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్ర తీరంలో ఈ నెల 24న జరిగే మాఘ పౌర్ణమి స్నానాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్లు దూరంలో వాడపాలెం సముద్ర తీరం ఉంది. శనివారం వేకువజాము నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడ సముద్రంలో మాఘస్నానాలు చేయనున్నారు. అనంతరం భక్తులు గంగాదేవి అమ్మవారిని దర్శించుకుంటారు. తీరంలో మాఘ స్నానాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు స్నానాలకు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం సముద్రతీరాల వద్ద కూడా భక్తులు మాఘస్నానాలు ఆచరించనున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘ స్నానాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఇక్కడ పవిత్ర స్నానాలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. స్నానాలు అనంతరం తీరంలో కొలువైన మాధవస్వామిని భక్తులు దర్శించుకుంటారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో నుంచి ముత్యాలమ్మపాలెం వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్టు అధికారులు వెల్లడించారు. తీరం వద్ద పరవాడ సీఐ బాలసూర్యారావు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. తీరంలో శుక్రవారం రాత్రి నుంచి జరగనున్న మాధవస్వామి తీర్థానికి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు.

రేవుపోలవరానికి 35 ప్రత్యేక బస్సులు

- 150 మంది పోలీసులతో బందోబస్తు


రేవుపోలవరంలో బస్సులు నిలిపే స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద శనివారం జరిగే మాఘ పౌర్ణమి జాతరకు ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. పుణ్య స్నానం ఆచరించడానికి రేవుపోలవరం సముద్రతీరానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. నర్సీపట్నం డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇందులో భాగంగా రేవుపోలవరం సమీపంలో బస్సులు, ద్విచక్ర వాహనాలను నిలిపే స్థలాలను, సముద్రతీర ప్రాంతాన్ని గురువారం నర్సీపట్నం డీఎస్పీ డి. వెంకట్రామయ్య పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి డీఎస్పీ స్థానిక సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావులకు పలు సూచనలు చేశారు. జాతరకు 150 మందితో పోలీసు బందోస్తును ఏర్పాటు చేయనున్నట్టు సీఐ అప్పన్న చెప్పారు.

కోనాం చింతపండుకు గిరాకీ


అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ, ఫిబ్రవరి 22: కోనాం సంతకు ఏజెన్సీ గ్రామాల నుంచి తీసుకువచ్చిన చింతపండుకి మంచి గిరాకీ పలకడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కొద్దిపాటి చింతపండు మాత్రమే సంతకు వచ్చింది. అది నాణ్యమైనది కావడంతో వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. కిలో రూ. 65 నుంచి రూ. 70 వరకూ ధర ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ మార్కెట్‌లో పెరిగిన హమాలి, కాటా చార్జీలు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 22 : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో హమాలి, కాటా చార్జీలు పెరిగాయి. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్, సంచాలకులు రాహుల్‌పాండే ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అమలులో వున్న రేట్లు కంటే ఈ ధరలు 20 శాతం అధికం. బెల్లం 100 కిలోలకు ప్రస్తుత హమాలీ చార్జీలు రూ.13.39 పైసలు కాగా ఇది రూ.16.07 పైసలకు పెరిగింది. అలాగే కాటాదారు చార్జిలు రూ.4.03 పైసలు నుంచి రూ.4.84 పైసలుకు పెరిగింది. వేరుశెనగ 40 కిలోలకు హమాలీ చార్జీ రూ.6.05 పైసలు నుంచి రూ.7.26 పైసలకు పెంచారు. కాటాదారు చార్జీలు రూ.2.16 పైసలు నుంచి రూ.2.59 పైసలకు పెంచారు. నువ్వులు 75 కిలోలకు, ఎండుమిర్చి 20 కిలోలకు హమాలీ చార్జీ రూ.6.48 పైసలు నుంచి రూ.7.77 పైసలకు పెంచారు. నువ్వులు కాటా చార్జీ రూ.2.88 పైసలు నుంచి రూ.3.46 పైసలకు పెరిగింది. ఎండుమిర్చి కాటా చార్జీ రూ.2.16 పైసలు నుంచి రూ.2.60 పైసలకు పెరిగింది. ఉల్లిపాయలు 70 కిలోలకు హమాలీ చార్జీ రూ.8.64 పైసలకు, కాటాదారు చార్జీ రూ.2.60 పైసలకు పెరిగింది. మిగతా వ్యవసాయ ఉత్పత్తుల హమాలి, కటాదారు చార్జీలు 75 కిలోల కంటే తక్కువ ఉన్నప్పుడు హమాలీ చార్జీ రూ.7.76 పైసలు, కటాదారు చార్జీలు రూ.2.60 పైసలకు పెంచారు. 75 కిలోల కంటే అధికంగా ఉంటే హమాలీ చార్జీలు రూ.9.50 పైసలు, కాటాదారు చార్జీలు రూ.3.46 పైసలుగా నిర్ణయించారు. ఈమేరకు గెజిట్ నోట్ విడుదలైంది.

చేతకాని పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్

- మంత్రికి కోడిగుడ్డును పార్శిల్ చేసిన టీడీపీ నేత


అనకాపల్లి పోస్టాఫీస్ వద్ద కోడిగుడ్లతో టీడీపీ నాయకులు

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేతకాని ఏకైక మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ విమర్శించారు. ఇటీవల శంఖారావం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పార్శిల్ ద్వారా అందించమని ఇచ్చిన కోడిగుడ్డును గురువారం టీడీపీ నాయకులతో కలిసి హెడ్ పోస్టాఫీసులో మంత్రి అమర్‌నాథ్ అడ్రస్‌కు పార్శిల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమర్‌నాథ్ చేతకాని మంత్రి అని స్వయంగా ఆ పార్టీ అధినేతే గుర్తించి రానున్న ఎన్నికల్లో టికెట్ కేటాయించకుండా కుర్చీని మడత పెట్టేశారన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఐదేళ్లల్లో చేసిన అక్రమాలు, భూదందాలు, కబ్జాలు గురించి నియోజకవర్గం కోడై కూస్తుందన్నారు. నారా లోకేశ్ రాష్ట్రానికి దేశ విదేశాల నుంచి వందలాది కంపెనీలను తీసుకు వచ్చి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్క కంపెనీని కూడా తీసుకురాని చేతకాని మంత్రి విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఐటీ రంగం కుదేలైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి బాబి, జగ్గారావు, మరపురెడ్డి సత్యనారాయణ, సూర్య, తోటాడ విజయ్, పృథ్వీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులే ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదిక ఇచ్చిందన్నారు. కొంతమంది కలెక్టర్ల సహకారంతోనే ఇసుక క్వారీలు నడపడం దారుణమన్నారు. ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా వైసీపీ నాయకులు కోట్లు గడించారని, దీనికి సీఎం జగన్ సమాధానం చెప్పాలని బుద్ధ డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలతో దోచుకున్న సొమ్మును రానున్న ఎన్నికల్లో వెదజల్లేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని బుద్ద వ్యాఖ్యానించారు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న అనధికార క్వారీలపై కలెక్టరుకు టీడీపీ తరుపున ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, తెలుగు మహిళ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయమా? వైసీపీ కార్యాలయమా?

- ఖాజీపాలెం వాసుల విస్మయం


సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సిద్ధం కటౌట్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 22: రంగులు, ఫొటోలు పిచ్చి శృతి మించి సచివాలయ భవనానికి సిద్ధం కటౌట్‌ను పెట్టేశారు స్థానిక వైసీపీ నాయకులు. ఈ కటౌట్‌ను చూసి స్థానికులు ఇది ప్రభుత్వ భవనమా? వైసీపీ కార్యాలయామా అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఖాజీపాలెంలో పంచాయతీ భవనాన్ని టీడీపీ హయాంలో నిర్మించారు. దీనిని అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన శిలాఫలకం ఉంది. అయితే ఇదే పంచాయతీ భవనంపై తాజాగా సచివాలయాన్ని కూడా నిర్మించారు. అయితే వైసీపీ నాయకులు గతంలో పంచాయతీ భవనం శిలాఫలకాన్ని న్యూస్‌పేపర్లు అంటించి కప్పేశారు. మొదటి అంతస్తులో సచివాలయాన్ని ఈనెల 20న ఎమ్మెల్యే కన్నబాబు రాజు ప్రారంభించారు. అయితే ఈ కార్యాలయం వదంద జెండాలు కట్టారు. అంతేకాక సచివాలయం భవనానికి సిద్ధం కటౌట్‌ని కూడా పెట్టారు. ప్రస్తుతం పంచాయతీ భవనం వైసీపీ కార్యాలయ భవనంలా కనబడుతోందని స్థానికులు అంటున్నారు.

తాగి స్కూల్ బస్సు నడిపిన డ్రైవర్ అరెస్టు

పాయకరావుపేట, ఫిబ్రవరి 22 : స్థానిక తాండవ షుగర్స్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీచేసిన పోలీసులు మద్యం సేవించి ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏఎస్ఐ గోవిదరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తాండవ షుగర్స్ సమీపంలో చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో కాకినాడ జిల్లా తునిలోని ఒక ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులను పాయకరావుపేట మీదుగా కోటనందూరుకు తీసుకువెళుతున్న స్కూల్ బస్సు డ్రైవరు అయినారెడ్డి రాజబాబు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో మద్యం తాగినట్టుగా నిర్ధారణ కావడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. విషయాన్ని స్కూల్ యాజమాన్యానికి తెలియజేసి స్కూల్ పిల్లలను విద్యా సంస్థలకు చెందిన వేరొక బస్సులో తరలించామన్నారు. అదుపులోకి తీసుకున్న బస్సు డ్రైవర్‌ను కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఆయన తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

రాంబిల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని జంగాలపాలెం సమీపంలో గురువారం తెల్లవారు జాము 4 గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి మరో లారీ ఢీకొట్టిందని సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయన్నారు. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో అనకాపల్లిలోని ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ లక్ష్మణరావు తెలిపారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 22: మండలంలోని తిక్కవానిపాలెంలో మేరిగ రాజన్న పాన్‌షాపులో 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను పరవాడ సీఐ బాలసూర్యారావు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని రాజన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 22: మండలంలోని దార్లపూడి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొన్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఒకొక్క ట్రాక్టర్‌కు రూ. పది వేలు చొప్పున జరిమానా విధించినట్టు ఆయన చెప్పారు. దార్లపూడి వద్ద వరహానది సమీపం నుంచి ట్రాక్టర్లతో ఇసుక తీసుకువెళుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు.

వలంటీర్లకు సత్కారం

నక్కపల్లి, ఫిబ్రవరి 22: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో పలువురు వలంటీర్లను రాజాం ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవా పురస్కారాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తాతాబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్బవరం, ఫిబ్రవరి 22 : మండలంలోని ఇరువాడలో 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయాన్ని గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు చైర్మన్ విజయకుమార్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులతో కొంత కాలంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా అనాథలకు ఆశ్రమం కూడా నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రేమనాథం, ఎస్.నిర్మల, పి.సత్యహవిలా, ఎస్.దివ్యతేజ, ఎస్.నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి ఎస్ఐగా గఫూర్

నక్కపల్లి, ఫిబ్రవరి 22: నక్కపల్లి ఎస్ఐగా గఫూర్ నియమితులయ్యారు. శ్రీకాకుళంలో పనిచేస్తున్న ఆయన్ని నక్కపల్లికి బదిలీ చేశారు. గతంలో పనిచేసిన విభీషణరావును ఎస్.రాయవరానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్ఐగా గఫూర్‌ను నియమించడంతో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

కరాటేలో సెయింట్ జాన్స్ విద్యార్థులు విజయం


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనకాపల్లి, ఫిబ్రవరి 22 : ఇటీవల రాజాంలో జరిగిన కరాటే పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో స్టేట్ కరాటే ఛాంపియన్-2024ను స్కూల్ విద్యార్థులు స్వర్ణ పతకాలు, వెండిపతకాలు సాధించారని కరాటే కోచ్ సీహెచ్ సూరి అప్పారావు తెలిపారు. విజయం సాధించిన సీహెచ్ టామేశ్వర్ అభిరామ్ సాయి, ఎ.లలిత, కె.పణీత్, ఎ.ఆరాధ్య దీక్షితలను స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి సీహెచ్ చంద్రమౌళి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అసకపల్లిలో ఆక్రమణలు తొలగింపు

సబ్బవరం, ఫిబ్రవరి 22 : మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. తహసీల్దార్ జె.చలమయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో జయశ్రీ, సిబ్బంది కలసి అసకపల్లి శివారు ఎర్రవానిపాలెం సర్వే నంబరు 1లో మూడు షెడ్లు, నక్కవానిపాలెం ఒకటి, కుమ్మరి కాలనీలో ఒక పునాదిని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చలమయ్య మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు తెర తీశారన్నారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే ఎటువంటి నిర్మాణాలైన కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. ఆక్రమణదారులపై ల్యాండ్ గ్రేబింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


కుమ్మరి కాలనీలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మీడియాపై దాడులు ఖండిస్తూ జర్నలిస్టుల నిరసన

ఎలమంచిలి, ఫిబ్రవరి 22: జర్నలిస్టులు, మీడియా సంస్థలపై వైసీపీ మూకల దాడులను ఖండిస్తూ గురువారం పట్టణంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో జర్నలిస్టులు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మీడియా సంస్థలు, జర్నలిస్టులపై దాడులు చేయడం దారుణమని ప్రెస్‌క్లబ్ ప్రతినిధి ఆడారి గంగాధర్ అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు వీరభద్రాచారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దాట్ల సుబ్బరాజు, గుమ్మెళ్ల గోవిందరావు, నగిరెడ్డి సత్యనారాయణ, సంఘ ప్రతినిధులు శ్రీమాన్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దుబాసి రమణ, సోమిరెడ్డి నారాయణమూర్తి, నాని జర్నలిస్టులు చిన్నాజీ, గణేష్, మళ్ల రాములు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

రాంబిల్లి, ఫిబ్రవరి 22 : రాప్తాడులోని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభను కవరేజ్ చేసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు దాడి చేయడం అమానుషమని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ తన విధులను నిర్వహిస్తుండగా వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడడం ప్రజాస్వామ్యంలో దారుణమన్నారు. ఇటువంటి చర్యలను మానుకోకపోతే ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.


ఎలమంచిలిలో డీటీ వీరభద్రాచారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పనుల వద్ద హెచ్చరిక బోర్డులేవీ?

ఎలమంచిలి, ఫిబ్రవరి 22: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకూ రూ.2.2 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టలేదు. అంతేకాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు రోడ్డు పనులు జరుగుతున్న చోట అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పగలు మాటెలా ఉన్నా.. చీకటి పడితే రోడ్డు పనుల వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు, పాదచారులను అప్రమత్తం చేసేందుకు పనులు జరుగుతున్న చోట హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మాణ పనులు వద్ద కానరాని రక్షణ చర్యలు


స్వామివారిని దర్శించుకుంటున్న ప్రగడ నాగేశ్వరరావు

వైభవంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

మునగపాక, ఫిబ్రవరి 22: స్థానిక సంతబయలులో గురువారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు పెంటకోట విజయ్, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చయ్యనాయుడు, టీడీపీ మునగపాక అధ్యక్షుడు దాడి శివ తదితరులు స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేగి రామకృష్ణ, కె. కోటి, శరగడం గణేష్, దాడి నాయుడు, పాము శ్రీను, వెలగా శ్రీను, దాడి భీమునాయుడు,తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

» కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు

నక్కపల్లి, ఫిబ్రవరి 22: సాగు భూములను కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిందని, దీనివల్ల తమ జీవనోపాధి దెబ్బతిందని, తక్షణమే తమకు పరిహారం, ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని కారిడార్ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నరసింగరావు, గింజాల వెంకట రమణ తదితరుల సమక్షంలో డీఎల్‌పురం, మూలపర్ర, పాటిమీద గ్రామాల నిర్వాసిత రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ, రెవెన్యూ సిబ్బందికి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు.

25న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం

దేవరాపల్లి, ఫిబ్రవరి 22 : అనకాపల్లిలోని రోటరీ క్లబ్ కల్యాణ మండపంలో ఈనెల 25న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశం జరగనున్నట్టు సమితి జిల్లా అధ్యక్షుడు గ్రట్టెడ్డి రాము తెలిపారు. ఈ సమావేశంలో దివ్యాంగులకు రూ. 6 వేలు పెన్షన్, అంత్యోదయ కార్డులు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

పేకాట శిబిరంలో కత్తి పోట్లు

... 5వ పేజీ తరువాయి

గోపాలపురం తోటల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి రాలేదని, బుధవారం తెల్లవారుజామున పేకాట శిబిరం వద్ద చాకుతో దాడి ఉదంతం కూడా తెలియదన్నారు. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.

వైసీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

... 5వ పేజీ తరువాయి

గోకివాడ రాము, ఎల్‌బీపీ అగ్రహారం సర్పంచ్ తమరాన శ్రీను, గున్నెంపూడి సర్పంచ్ ముచ్చకర్ల నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ పార్టీలో ముసలానికి కారణమైన పార్టీ మండల అధ్యక్షుడిగా జోగా కొండబాబును తొలగించి, పార్టీ కార్యకర్తలను ఆదరించాలని ధర్మశ్రీని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు, వేపాడ మధు, శరకాన బాబురావు, ముచ్చకర్ల వెంకటరావు, కోరుకొండ సూరిబాబు, కుబిరెడ్డి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి యాప్‌పై వైద్య సిబ్బందికి అవగాహన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కిల్కారి యాప్ వినియోగంపై పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల సిబ్బందికి గురువారం రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ మోహనరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రవళి అవగాహన కల్పించారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం గర్భిణులు, బాలింతలు, పిల్లల గురించి తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించవల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మోహనరావు

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి జాతర

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 22: పట్టణంలోని విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవారికి పూజలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నాయకులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తాయి.


మరిడిమాంబని దర్శించుకుంటున్న కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

సబ్బవరం, ఫిబ్రవరి 22: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీవో లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. టెక్కలిపాలెం శివారు నాయనమ్మపాలెం, రావలమ్మ పాలెం, రావలమ్మపాలెం-2, బలిజపాలెం (ఓసీ), వంగలి-2, తప్పవానిపాలెం, అమృతపురం-2 (ఎస్సీ), సూరెడ్డిపాలెం (ఓసీ) గ్రామాల్లో ఆయా పోస్టులకు, సబ్బవరం శివారు గణపతిపురం (ఓసీ) మినీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా మన్నారు. దరఖాస్తులను ఈనెల 23 నుంచి 29 వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సీడీపీవోకు నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ పంపుకోవచ్చన్నారు.

ప్రభుత్వ భూమిలో పంటల సాగు

» హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్..

» చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

మునగపాక, ఫిబ్రవరి 22 :

జిరాయితీ భూములను ప్రభుత్వ అవసరాలకు అమ్మి తిరిగి అదే భూమిని ఆక్రమించుకుని దర్జాగా పంటలు పండించుకుంటున్న వ్యవహారం మండలంలోని గణపర్తిలో వెలుగు చూసింది. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శలున్నాయి. ఈ విషయమై హైకోర్టు ఆదేశాలను కూడా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. వివరాల్లోకి వెడితే..

మండలంలోని గణపర్తి గ్రామంలో శారదానది గట్టు పటిష్టం చేయడానికి పక్కనే ఉన్న జిరాయితీ భూములను ప్రభుత్వం 2009లో సెంటు ఐదు వేల రూపాయల చొప్పున కొనుగోలు చేసింది. సర్వే 167లో 73 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించుకుని చాలాకాలంగా పంటలు పండించుకుంటున్నారు. అలాగే నది గట్టుపై పాకలు, షెడ్లు వేసి ఆక్రమించుకున్నారు. అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పంటలు వేసిన రైతులు దిగువ ఆయకట్టు రైతుల రాకపోకలు సాగించే కాలిబాటలను ముళ్ల కంచెలు వేసి మూసివేయడంతో వివాదం మొదలైంది. దీనిపై గ్రామానికి చెందిన మారిశెట్టి అప్పలరాజు అనే రైతు గత ఏడాది ఏప్రిల్‌లో స్పందనలో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు వచ్చి ఆక్రమణదారులకు 7 రోజులలో ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. నేటికీ వారు సాగులోనే ఉన్నారు. అలాగే రెవెన్యూ సిబ్బంది కేవలం 15 సెంట్లలో గట్టు మాత్రమే ఆక్రమణకు గురైందని నివేదిక ఇచ్చేశారు. అంతేకాని భూమిని ఆక్రమించుకుని పంటలు వేశారని నివేదికలో పేర్కొనలేదు. ఉన్నతాధికారుల విచారణ సమయంలో గ్రామ వీఆర్వో, సర్వేయర్ మస్కా కొట్టడం గమనార్హం. దీంతో అప్పలరాజు గత ఏడాది డిసెంబరులో హైకోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణదారులను ఖాళీ చేయించాలంటూ రెవెన్యూ అధికారులకు, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు జారీ చేసి రెండు నెలలు కావస్తున్నా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో సదరు రైతు కోర్టు ధిక్కారణ దావా వేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. దీనిపై తహసీల్దార్ పాపారావును వివరణ కోరగా.. తాను విధుల్లో చేరి వారం రోజులు మాత్రమే అయిందని, దీనిపై విచారణ జరుపుతానన్నారు.


ప్రభుత్వ భూమిలో పంటలు వేసిన దృశ్యం

'నూకాంబిక' హుండీ ఆదాయం రూ. 26.65 లక్షలు


అమ్మవారి ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ హుండీ లెక్కింపు నిర్వహించారు. గతేడాది నవంబరు 25వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.26 లక్షల 64వేల 970 నగదు సమకూరగా, 20 గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారం, కేజీ 98 గ్రాముల వెండి అమ్మవారికి ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలు నరసింగరాజు, లక్ష్మీశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా దిబ్బపాలెం దుర్గాలమ్మ పండగ

అనకాపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని దిబ్బపాలెంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, వైసీపీ నాయకులు మలసాల భరత్‌తోపాటు పలువురు పూజలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

వైభవంగా దుర్గమాంబ పండుగ

పరవాడ, ఫిబ్రవరి 22: మండలంలోని కలపాకలో దుర్గమాంబ అమ్మవారి పండుగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, స్థానిక సర్పంచ్ బొండా కనకారావు, నాయకులు ఇందల కొండలరావు, నగిరెడ్డి చిన్నారావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే మరిశవానిపాలెంలో గురువారం దుర్గమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


పూజలందుకున్న దుర్గమాంబ అమ్మవారు

బ్యాడ్మింటన్‌లో మెరిసిన విద్యార్థిని కావ్య

ఎలమంచిలి, ఫిబ్రవరి 22: గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 19వ తేదీ నుంచి 3 రోజులుపాటు జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సిరసపల్లి కావ్య బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి తెలిపారు. ఈమె రూ.15 వేల నగదు బహుమతి అందుకున్నట్టు చెప్పారు. జాతీయ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కావ్యను ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.



వీఆర్‌వోల డైరీల ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరించిన వీఆర్వోల సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 22: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డైరీలను జిల్లా వీఆర్‌వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకాస్, అనంతరామయ్య గురువారం ఆవిష్కరించారు. అనంతరం వీటిని వీఆర్‌వోలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్, మండల సంఘాల ప్రతినిధులు చేవేటి అప్పారావు, సూర్యానారాయణ, మారేశ్వరావు, రాంబాబు పాల్గొన్నారు.

డైట్‌లో అంతర్జాతీయ కవల పిల్లల దినోత్సవం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : స్థానిక డైట్ కళాశాలలో గురువారం ట్విన్స్ (కవల పిల్లలు) డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ హాజరై మాట్లాడారు. మదర్స్ డే, ఫాదర్స్ డే మాదిరిగా కవల పిల్లలకు ట్విన్స్ డే పేరిట ఫిబ్రవరి 22వ తేదీన అంతర్జాతీయంగా జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని రేబాక శివారు కాపుశెట్టివానిపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉచితంగా అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

కోటవురట్ల హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు


హైస్కూల్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కోటవురట్ల, ఫిబ్రవరి 22: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కేఎల్‌వీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నతమైన ఫలితాలు సాధించాలన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

గ్రామాల్లో అడవిరాజుబాబులు పండగ



భక్తుల పూజలందుకుంటున్న అడవి రాజుబాబులు

మాకవరపాలెం/కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజుబాబుల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. పైడిపాల, శెట్టిపాలెం, చామంతిపురం, తూటిపాల, పాపయ్యపాలెం గ్రామాల్లో ఈ వేడుక జరిగింది. ఉదయాన్నే భక్తులు గ్రామాలకు దూరంగా ఉన్న పొలాల్లో అడవిరాజుబాబు గుడులకు వెళ్లి పూజలు జరిపారు. ఇదిలావుంటే, శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద గల ఆలయంలో అడవి రాజుబాబుల పండగ జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు తెలిపారు. కొయ్యూరు, గొలుగొండ, నాతవరం, చింతపల్లి తదితర మండలాల నుంచి భక్తులు విచ్చేయనున్నట్టు ఆయన చెప్పారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 : సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన బొమ్మల రాజేశ్వరి కాంస్య పతకం సాధించింది. ఈనెల 13 నుంచి 20 వరకు బెంగళూరులో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతను గురువారం ఇక్కడ ఎమ్మెల్యే గణేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ యర్రా శేఖర్, వేపాల ప్రియాంక పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి

▸ పోలీసు సిబ్బందికి డీఎస్పీ వెంకట్రామయ్య సూచన ▸ విధులపై శిక్షణ ▸ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన





శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఎస్పీ

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 : ఎన్నికల విధులకు సర్వ సన్నద్ధంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ బి.వెంకట్రామయ్య సూచించారు. పట్టణంలోని శారదానగర్ ఊడా రెసిడెన్షియల్ ఫంక్షన్ హాల్‌లో గురువారం పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లుగా నియామకమైన హెచ్‌సీలు, ఏఎస్ఐల వారి పరిధిలోని పాఠశాలలు, రెవెన్యూ శాఖ నుంచి సెక్టార్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. ప్రహరీ గోడలు లేని పాఠశాలలు (పోలింగ్ కేంద్రాలు) ఉంటే తక్షణమే జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక ఇవ్వాలని ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలు చట్ట ప్రకారం నేరమని స్పష్టం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆధారాలు చూపని రూ.50 వేలకు పైబడి డబ్బుతో ఎవరైనా దొరికితే సీజ్ చేయాలని ఆదేశించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ కంట్రోల్‌లో పని చేస్తున్నామన్న విషయాన్ని మరువరాదని, జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఓటుకు డబ్బు పంచడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో రాజకీయ నాయకుల మధ్య గొడవలు జరిగితే ఇరు వర్గాలను విడిదీసి సముదాయించి పంపించాలని, అంతే కాకుండా పై అధికారికి సమాచారం ఇవ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్, రూరల్, నక్కపల్లి సీఐలు కాంతికుమార్, హరి, అప్పన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోలాటం బృందానికి చీరలు పంపిణీ



కళాకారులకు చీరలు పంపిణీ చేస్తున్న బాలాజీ

మాకవరపాలెం, ఫిబ్రవరి 22 : ఇక్కడి పట్టాలమ్మ కోలాట బృందానికి గురువారం కోలాట సామగ్రితో పాటు చీరలను ఎం.బాలాజీ అనే వ్యక్తి పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కోలాటం, భజన బృందాలను అంతా పోత్సహించి ఈ కళలకు జీవం పోయాల్సిందిగా ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయం పక్కనే భూకబ్జా జరిగినా పట్టదా..?

▸ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ ప్రశ్న



వినతి పత్రం అందిస్తున్న విజయ్

నాతవరం, ఫిబ్రవరి 22 : మండల కేంద్రం నాతవరం తహసీల్దార్ కార్యాలయం పక్కనే స్థలం కబ్జాకు గురైనా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేకపోవడం దారుణమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక నాయకులతో కలిసి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జి.కొండబాబుకు ఇరవై సంవత్సరాలకు ముందే పట్టా ఇచ్చారన్నారు. సదరు భూమిని వేరే వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఈ తంతు జరిగినా అధికారులు పట్టించు కోకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, అపిరెడ్డి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

ఘనంగా కేశవస్వామి కల్యాణం

చోడవరం, ఫిబ్రవరి 22 : పట్టణంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి 151వ కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ముందుగా మూడు వందల మంది మహిళలతో కుంకుమార్చన, లక్ష్మీదేవి పూజ జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శన సీతారామాచార్యులు, స్థానిక పెద్దలు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేడుకకు హాజరైన భక్తజనం

నేడు పెదబొడ్డేపల్లిలో విద్యుత్‌కు అంతరాయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 22 : పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పెద్దబొడ్డేపల్లి 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ స్తంభాలు మార్చనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ సత్యానందం తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పెదబొడ్డేపల్లి డాబా కాలనీ నుంచి ఎమ్మెల్యే ఇంటి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వ్యవసాయ మోటార్లకు ఏడు గంటలే విద్యుత్ సరఫరా..!

▸ తొమ్మిది గంటలని ప్రభుత్వం చెప్పినా కోతలపై రైతులు ఆగ్రహం

▸ నీరందక పంటలు పాడవుతున్నాయని ఆందోళన

▸ మరో రెండు వారాల్లో సమస్య పరిష్కారం కానుందన్న ఇన్‌చార్జి ఏఈ

గొలుగొండ, ఫిబ్రవరి 22 : వ్యవసాయ మోటార్లకు ఏడు గంటలే విద్యుత్తును సరఫరా చేస్తుడడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా జనవరి 31వ తేదీ వరకూ చేసింది. అయితే రెండు వారాలుగా ఏడుగంటలే సరఫరా చేస్తుండడంతో వివిధ రకాలైన కూరగాయలు, అపరాల పంటలకు సాగుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని కృష్ణాదేవిపేట, గొలుగొండ, ఏటిగైరంపేట గ్రామాల్లో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు 980 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఏడు గంటలే విద్యుత్ ఉంటుండడం, దీనికితోడు ఎండలు ముదురుతుండడంతో పంటల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆయా రైతులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా, బలిఘట్టంలో గల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు గంటల విద్యుత్ సరఫరాలో కోత విధించినట్టు చెప్పారు. రెండు వారాల్లో సమస్య పరిష్కారం కానుందన్నారు.

పేకాట శిబిరంలో కత్తి పోట్లు

... 5వ పేజీ తరువాయి

గోపాలపురం తోటల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి రాలేదని, బుధవారం తెల్లవారుజామున పేకాట శిబిరం వద్ద చాకుతో దాడి ఉదంతం కూడా తెలియదన్నారు. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.

వైసీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

... 5వ పేజీ తరువాయి

గోకివాడ రాము, ఎల్‌బీపీ అగ్రహారం సర్పంచ్ తమరాన శ్రీను, గున్నెంపూడి సర్పంచ్ ముచ్చకర్ల నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ పార్టీలో ముసలానికి కారణమైన పార్టీ మండల అధ్యక్షుడిగా జోగా కొండబాబును తొలగించి, పార్టీ కార్యకర్తలను ఆదరించాలని ధర్మశ్రీని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు, వేపాడ మధు, శరకాన బాబురావు, ముచ్చకర్ల వెంకటరావు, కోరుకొండ సూరిబాబు, కుబిరెడ్డి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం

రత్నంపేటలో విద్యుత్ ఇబ్బందులు

రోలుగుంట, ఫిబ్రవరి 22 : మండలంలోని రత్నంపేట శివారు పనసలపాడులో తరచూ విద్యుత్ కోతల వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 50 మంది ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్నారు. వర్షం వచ్చినప్పుడు, చిన్నపాటి గాలులు వీచినప్పుడు కూడా విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయి. అలాగే వీధి స్తంభానికి ఉన్న స్విచ్ బోర్డు మరమ్మతుకు గురై, ఏడాది అవుతున్నా ఇప్పటికీ కొత్త బోర్డు ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు : వైసీపీ

చోడవరం, ఫిబ్రవరి 22 : ప్రజలకు ఏం చేశామో చెప్పుకోలేక టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు ప్రభుత్వ విప్ ధర్మశ్రీపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు అన్నారు. గురువారం సాయంత్రం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ నేతల వద్ద మెప్పు కోసం తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు స్థాయికి మించి ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోకు అభినందనలు

చోడవరం, ఫిబ్రవరి 22 : ఎన్ఎస్ఎస్ పీవోలుగా పని చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లకు ఏయూలో మానసిక ఆరోగ్యం అన్న అంశంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆదిత్యబిర్లా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ పీవో రత్నభారతి హాజరయ్యారు. శిక్షణలో ప్రతిభ చూపి ఆమె బహుమతులు పొందడంతో కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ తదితరులు అభినందించారు.



చోడవరంలో నిరసన వ్యక్తం నాయకులు



దేవరాపల్లిలో బీజేపీకి వ్యతిరేకంగా నాయకుల నినాదాలు



కవ్వగుంటలో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రైతులపై కాల్పులు అమానుషం

కేంద్ర ప్రభుత్వం తీరుపై వ్యవసాయ కార్మిక సంఘం నిరసన

రావికమతం, ఫిబ్రవరి 23 : హరియాణాలో పంటలకు గిట్టుబాటు ధర కావాలని ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు జరపడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు అన్నారు. రైతులపై పోలీసులు జరిపిన కాల్పులకు నిరసనగా కవ్వగుంట, కల్యాణపులోవ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపు అని విమర్శించారు. ఎరువులు, పురుగు మందులు, కూలీల ధరలు పెంచడమే కాకుండా పంటకు గిట్టుబాటు ధర కోరడమే నేరంగా భావించడం సిగ్గు చేటన్నారు. పోలీసుల తీరు వల్ల యువ రైతు మృతి చెందగా, 25 మంది గాయాలపాలయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొబ్బా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో..

చోడవరం : శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు జరిపి ఓ రైతు మృతికి కారణమైన ఘటనపై ఏపీ రైతు సంఘం నాయకులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపిన పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మేడ చంటి, ఇక్బాల్, భూపతి క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెబుతాం : నేతలు

దేవరాపల్లి : మోదీ ప్రభుత్వాన్ని రైతులు సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. రైతులపై పోలీసుల కాల్పులను ఖండిస్తూ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రోలుగుంట, ఫిబ్రవరి 22 : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ డప్పు కళాకారులతో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం వారు రోలుగుంటలో ఓటు వినియోగంపై డప్పు కళాకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలన్నారు. ఇప్పటికీ ఓటుహక్కు పొందని వారు, 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీడబ్ల్యూ ఓటర్లకు, 80 ఏళ్లు పూర్తయిన వారికి ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కూడా వారికి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై దాడి సరికాదు'



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మాడుగుల, ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు మాడుగులలోని టీడీపీ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడారు. మీడియా స్వేచ్ఛను హరించి దౌర్జన్యానికి దిగడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, రంజిత్ వర్మ, మజ్జి తాతబాబు, సన్యాసిరావు, శివాజీ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

ఘనంగా కేజీబీవీ వార్షికోత్సవం

కె. కోటపాడు, ఫిబ్రవరి 22 : విద్యార్థులు మంచి నడవడికతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ కూనిరెడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. గురువారం ఆయన కింతాడ శివారు గొల్లలపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వార్షికోత్సవంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వర్తించి, పిల్లల భవిష్యత్తుకు ఉన్నతంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డు చిన్నమ్మలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పల్లా కన్నమ్మ, విద్యా కమిటీ చైర్మన్ ఒమ్మి భూలోక, పల్లా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఏ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ, పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే కేసులు

సహాయ కార్మిక శాఖాధికారి సత్యనారాయణ

చోడవరం, ఫిబ్రవరి 22 : బాల కార్మికులతో పని చేయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని స్థానిక సహాయ కార్మిక శాఖాధికారి పి. సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్లలోపు వయస్సున్న కార్మికులతో పనులు చేయిస్తున్న దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి కార్మికులకు రావాల్సిన అదనపు వేతనాన్ని వసూలు చేసి కార్మికులకు అందజేస్తున్నామని తెలిపారు. ఈవిధంగా బాలకార్మికులతో పనులు చేయించిన 8 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.48393 వసూలు చేశామన్నారు, ఈమేరకు పట్టణంలోని ఓ స్వీటు షాపులో పనిచేస్తున్న బాల కార్మికుడికి ఆ యజమాని నుంచి రావాల్సిన అదనపు వేతనం రూ 13 680 డీడీ రూపంలో కార్మికుడికి అందచేసినట్టు తెలిపారు. వ్యాపారులెవరూ బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవద్దని, అలా చేస్తే కేసులతో పాటు అదనపు వేతనం జరిమానా రూపంలో వసూలు చేస్తామని చెప్పారు.

పశువులకు కృత్రిమ గర్భాధారణ ఇంజక్షన్లు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 22 : అంతరించిపోతున్న మేలు జాతి పశువులను అభివృద్ధి చేయడానికి పిండమార్పిడి ద్వారా కృత్రిమ గర్భాదారణ ఇంజక్షన్లు వేస్తున్నామని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు చిట్టినాయుడు తెలిపారు. గురువారం కింతలిలో స్థానిక పశు వైద్యాధికారి నరేశ్, రైతు దామరౌతు రాజునాయుడుకి చెందిన సంకర జాతి జెర్సీ పశువుకి ఒంగోలు జాతి పిండాన్ని ఇంజక్షన్ ద్వారా ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చిట్టినాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండ మార్పిడి పద్ధతి ద్వారా దేశవాళీ, మేలుజాతి పశువులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో తొలిసారిగా సంకరజాతి పశువులో అద్దె గర్భంగా తీసుకుని (సరోగసి పద్ధతి) వేర్వేరు ప్రాంతాల్లో పిండ మార్పిడి ప్రవేశపెడుతున్నామని తెలిపారు. మేలు జాతి పశువును కృత్రిమ గర్భాదారణ ద్వారా పొందాలంటే 12 ఏళ్లు పడుతుందని, కానీ పిండ మార్పిడి ద్వారా మేలైన జాతులను మూడేళ్ల వ్యవధిలోనే పొందవచ్చునన్నారు.

మాడుగుల నియోజకవర్గం

ఆయా పోస్టులకు దరఖాస్తులు

కె. కోటపాడు, ఫిబ్రవరి 22 : ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏపీవో డి. మంగతాయారు తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కె. కోటపాడు మండలంలో పొడుగుపాలెం, దేవరాపల్లి మండలంలో ఎస్ఆర్ చేనులపాలెం కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన వారు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ

దేవరాపల్లి, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం అట్టలు పంపిణీ చేశారు. కోసూరు సత్యన్నారాయణ జ్ఞాపకార్థం అతని కుమారుడు రవిశంకరు 120 అట్టలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పడాల్ దాస్, ఉషారాణి, కేవీ రమణ, కె. శ్రీను, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

25న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం

దేవరాపల్లి, ఫిబ్రవరి 22 : అనకాపల్లిలోని రోటరీ క్లబ్ కల్యాణ మండపంలో ఈనెల 25న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశం జరగనున్నట్టు సమితి జిల్లా అధ్యక్షుడు గటిరెడ్డి రాము తెలిపారు.గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్న ఈ సమావేశంలో వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్, అంత్యోదయ కార్డులు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

దేవరాపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని నృసింహ గజపతినగరం గ్రామంలో నారితల్లమ్మ గుడి నుంచి వడ్రవారి కల్లాలకు రోడ్డు వేస్తున్నారు. ఉపాధి నిధులతో చేపడుతున్న ఈ పనులను సర్పంచ్ నాగిరెడ్డి శటారినాయుడు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చీడికాడ, ఫిబ్రవరి 22 : పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం పక్కనున్న చెత్తను సిబ్బందితో గురువారం దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయ పరిసరాల శుభ్రతకు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చెత్త కాగితాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత గంగయ్యకు మాతృ వియోగం

మాడుగుల, ఫిబ్రవరి 22 : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా గంగయ్య తల్లి వీరలక్ష్మి (89) బుధవారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పుట్టా అమరయ్యశెట్టి గుప్తా కుమారుడు రామలింగస్వామి (రాంబాబు) సతీమణి వీరలక్ష్మి. ఆమె మృతి పట్ల పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.